క్లుప్తంగా

విద్యా సామగ్రి పంపిణీ



విద్యార్థులకు బుక్స్ అందజేస్తున్న దాత

రొంపిచెర్ల: మండలంలోని బొమ్మయ్యగారిపల్లె పంచాయతీ ముంగరవారిపల్లె ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శనివారం తిరుపతికి చెందిన మార్క్ సెక్యూరిటీ సభ్యుడు జి.మోహన్ రావు విద్యా సామగ్రి అందజేసినట్టు ఎంఈవో శ్రీనివాసులు తెలిపారు. పెన్నులు, పెన్సిళ్లు, నోట్ బుక్స్, ప్యాడ్స్, కాపీ రైటింగ్ బుక్స్ ఇచ్చినట్టు తెలిపారు. విద్యార్థులకు చేయూత ఇవ్వడానికి దాతలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గీత, సీఆర్‌పీ కిరణ్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

యువకుడికి నివాళి



అనీల్‌కుమార్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

వి.కోట: మండలంలోని ఓగు గ్రామానికి చెందిన కృష్ణప్ప కుమారుడు అనీల్‌కుమార్ అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు గ్రామానికి చేరుకున్నారు. యువకుడి భౌతికదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

విట్నెస్ అధికారి నియామకం రద్దు చేయాలి

పులిచెర్ల(కల్లూరు): మెగా పీటీఎంలో విట్నెస్ అధికారి నియామక ఉత్తర్వును రద్దు చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సదాశివ రెడ్డి, జిల్లా కార్యదర్శి ఈశ్వర్ డిమాండ్ చేశారు. వారు శనివారం ఒకప్రకటన విడుదల చేశారు. ఈ నెల10వ తేదీన పాఠశాలల్లో నిర్వహించనున్న మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశంలో విట్నెస్ అధికారిని హెచ్‌ఎం నియమించుకుని వారితో ఫొటోలు తీసి అప్‌లోడ్ చేయాలని సమగ్ర శిక్ష రాష్ట్ర పీడీ ఉత్తర్వులు ఇవ్వడం దారుణమని పేర్కొన్నారు. ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేస్తామన్న విద్యాశాఖ అందుకు భిన్నంగా ఇతర కార్యక్రమాలకు వినియోగించడం తగదని వెల్లడించారు. పాఠశాల ప్రారంభమైన నెల రోజులకే యోగా పేరుతో, పీటీఎం పేరుతో బోధనా సమయాన్ని హరిస్తున్నారని తెలిపారు. ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని కోరారు.

రాజనాలబండలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి

చౌడేపల్లె: సత్య ప్రమాణాలకు నిలయమైన రాజనాల బండలో ప్రసన్న ఆంజనేయస్వామికి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు కృష్ణమూర్తి ఆధ్వర్యంలో ఆకుపూజ, అభిషేకాలు చేశారు. పుంగనూరు, మదనపల్లె, చిక్‌బలాపురం నుంచి చోరీ కేసుల్లో ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు రాజనాలబండకు వచ్చారు. అర్చకులు ఇరువర్గాలతో సమావేశమై ప్రమాణం చేయడానికి వారం రోజులు గడువునిచ్చారు.

సదుంలో మోస్తరు వర్షం

సదుం: మండల కేంద్రమైన సదుంతో పాటు పలు ప్రాంతాల్లో శనివారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. తొలకరిలో వర్షాలు ఆశలు రేకెత్తినా.. అనంతరం ముఖం చాటేయడంతో వేరుశనగ రైతులు ఆందోళన చెందుతున్నారు. అదును దాటుతున్నా సరైన వర్షాలు లేక విత్తు సమయం దాటిపోతుండడంతో ఏమి చేయాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు.

650 మందికి ఇద్దరు టీచర్లు



మోహన్ నాయక్

రామకుప్పం (కుప్పం): రామకుప్పం మోడల్ స్కూల్‌లో టీచర్ల కొరత తీవ్రంగా వుందని, వెంటనే టీచర్లను నియమించాలని వైఎస్సార్ సీపీ ఉమ్మడి జిల్లాల గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు మోహన్ నాయక్ కోరారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. మోడల్ స్కూల్‌లో 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు 650 మంది విద్యార్థులు చదువుకుంటున్నారని తెలిపారు. సుమారు 20 మంది వరకు ఉపాధ్యాయులు ఉండాల్సి ఉండగా ఇద్దరు మాత్రమే ఉన్నట్టు తెలిపారు. దీంతో పిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఉపాధ్యాయుల కొరత తీర్చాలని పలుమార్లు విద్యాశాఖ అధికారులకు విన్నవించినా ఫలితం లేదన్నారు. ఇలా అయితే పబ్లిక్ పరీక్షల్లో పదో తరగతి, ఇంటర్ విద్యార్థులు ఎలా ఉత్తీర్ణులవుతారని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఉపాధ్యాయుల కొరత తీర్చాలని కోరారు.

జనంలోకి కూటమి మోసాలు

- బాబు ష్యూరిటీ మోసానికి గ్యారెంటీగా మారింది
- హామీలన్నీ అమలు చేసేశామంటే జనం నమ్ముతారా
- నాటి పాలనకు, నేటి కూటమి పాలనకు తేడాను క్యూఆర్‌కోడ్‌లో చూడండి
- వైఎస్సార్ సీపీ రీజనల్ కోఆర్డినేటర్, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, నాయకులు.

పలమనేరు / గంగవరం / పెద్దపంజాణి / వి.కోట: కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో చేసిన మోసాలను ప్రజలకు అర్థమయ్యేలా వివరించి రుజువు చేయాల్సిన అవసరం వైఎస్సార్ సీపీ శ్రేణులపై ఉందని ఆ పార్టీ రీజనల్ కోఆర్డినేటర్, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. ఆయన శనివారం పలమనేరులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహణపై సమావేశం నిర్వహించారు. నాయకులతో కలిసి క్యూఆర్ కోడ్ కరపత్రాలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలకు చేసిన మోసాన్ని ఇంటింటికీ తీసుకెళ్లాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. ఈ నెల 13 నుంచి ఇంటింటికీ ఈ కార్యక్రమాన్ని పటిష్టంగా చేపట్టాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే వెంకటేగౌడ గంగవరం, వి.కోట, పెద్ద పంజాణి మండలాల్లో పార్టీ శ్రేణులతో సమావేశమై బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహణపై దిశా నిర్దేశం చేశారు. అదేవిధంగా పలమనేరు మున్సిపాలిటీ, మండల కన్వీనర్లు హేమంత్‌కుమార్‌రెడ్డి, బాలాజీ నాయుడు సైతం ప్రసంగించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రిని పలువురు నేతలు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.రెడ్డెప్ప, పెద్దపంజాణి, గంగవరం కన్వీనర్లు బాగారెడ్డి, భాస్కర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు మురళీ కృష్ణ, చెంగారెడ్డి, దయానందగౌడ, గంగవరంలో ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రహ్లాద, ఎంపీపీ వెంకటరమణ, పార్టీ మండల కన్వీనర్ భాస్కర్‌రెడ్డి, నాయకులు చంద్రప్ప, గిరిరాజారెడ్డి, శ్రీరాములురెడ్డి, చలపతిరెడ్డి, రాధాక్రిష్ణ, వి.కోటలో వైస్ ఎంపీపీలు తమీమ్, లక్ష్మన్ రెడ్డి, జెడ్పీ చైర్మన్ ప్రత్యేక సలహాదారుడు ఎస్ఎ గౌస్, నాయకులు ధనంభక్త, చంద్రారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, బాలాజీ, పూలనాగ, శంకర్‌రెడ్డి, ఇంద్రేష్, పెద్ద పంజాణిలో జెడ్పీటీసీ సుష్మకీర్తి, వైస్ ఎంపీపీలు జీడీ.బాబు, ఆంజమ్మ, కోఆప్షన్ సభ్యుడు రహంతుల్లా, సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు శంకరప్ప, నాగశంకర్‌రెడ్డి, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.



గంగవరం : కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు

పథకాలు వచ్చాయా అని అడుగుదాం



ఈ నెల 13 నుంచి ప్రతి గడపకూ వెళ్లి చంద్రబాబు చెప్పిన పథకాలన్నీ మీ ఇంటికి చేరాయా అని అడుగుదాం. గత ప్రభుత్వంలో కలిగిన లబ్ధిని, కూటమి ప్రభుత్వం అందజేసిన లబ్ధిని క్యూఆర్ కోడ్ ద్వారా వారికే చూపెట్టే మంచి కార్యక్రమిది. దీన్ని పటిష్టంగా చేపట్టాల్సిన బాధ్యత పార్టీ శ్రేణులపై ఉంది. ఏ ప్రభుత్వం జనానికి మేలు చేసిందో కళ్లకు కట్టినట్టు జనానికి అర్థమవుతుంది. –వెంకటేగౌడ, పలమనేరు మాజీ ఎమ్మెల్యే

సూపర్ సిక్స్ హామీలను అమలు చేశారట



ఎన్నికల్లో ఇష్టానుసారంగా హామీలు గుప్పించిన కూటమి నేతలు ఏడాదిలో వాటిని అమలు చేయకుండా చేతులు ఎత్తేశారు. ఇప్పుడు ప్రజలను మోసం చేస్తూ సూపర్‌సిక్స్ హామీలను అమలు చేశామని సీఎం చంద్రబాబునాయుడు నిస్సిగ్గుగా చెప్పడం హాస్యాస్పదంగా ఉంది. రాష్ట్రంలో రెడ్‌బుక్ పాలన సాగుతోంది, ఎవరైనా మాట్లాడితే కేసులు తప్పడం లేదు. దీన్ని జనం గమనిస్తున్నారు. – శ్రీనివాసులు, జెడ్పీ చైర్మన్

రైతులకు అండగా నిలవడం తప్పా



మామిడి రైతులు ధరలేక ఇబ్బందులు పడుతుంటే ఆదుకోవాల్సిన ప్రభుత్వం పట్టించుకోలేదు. రైతులు మామిడి కాయలను నేల పారబోస్తున్నారు. చెట్లను నరికేస్తున్నారు. ఈ క్రమంలో వారి పక్షాన పోరాడేందుకు మాజీ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రావడానికి అనుమతులు ఇవ్వకపోవడం దారుణం. సూపర్ సిక్స్ పేరిట కూటమి జనాన్ని ఏలా ఏమార్చిందో ఇంటింటికీ చెబుదాం. –ఎన్.రెడ్డెప్ప, చిత్తూరు మాజీ ఎంపీ

రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోంది



రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోంది. పోలీసు వ్యవస్థ కూటమి నేతలకు కీలుబొమ్మలుగా మారింది. అన్ని శాఖల అధికారులు పచ్చచొక్కాల మాట వింటున్నారే గాని ఇక్కడ న్యాయానికి తావులేదు. మామిడి రైతుల కడుపుమంట కూటమి నేతలకు పట్టనట్టుగా ఉంది. కేంద్రంలో చక్రం తిప్పే చంద్రబాబునాయుడు, ఆయన ఎంపీలు ఈ విషయంలో ఎందుకు పట్టించుకోవడం లేదు. –డాక్టర్ సునీల్, మాజీ ఎమ్మెల్యే, పూతలపట్టు

వర్షపునీరు వెళ్లేలా చర్యలు



కాలువలో మట్టి తీస్తున్న కార్మికులు

సాక్షి ఎఫెక్ట్..

పుంగనూరు(చౌడేపల్లె): పుంగనూరు పట్టణంలోని రామసముద్రం రోడ్డులో వర్షపు నీరు నిలుస్తుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై గత నెల 26న సాక్షి దినపత్రికలో చినుకుపడితే జలమయం అన్న శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన మున్సిపల్ కమిషనర్ మధుసూదన రెడ్డి శనివారం కార్మికులతో కలిసి అక్కడికి చేరుకున్నారు. వర్షపు నీరు నిలిచే ప్రాంతాన్ని పరిశీలించారు. గతంలో అక్కడ మురుగు కాలువ ఉండేదని గుర్తించి పూడిక తొలగించారు. అలాగే ఈద్గా ముందు కాలువల్లో పూడిక మట్టిని తొలగించి నీరు బయటకు వెళ్లేలా చర్యలు చేపట్టారు. సమస్యను పరిష్కరించిన కమిషనర్‌కు ప్రజలు, ప్రయాణికులు కృతజ్ఞతలు తెలిపారు.

బ్యాంకు ఖాతాలకు ఎన్‌పీసీఐ అనుసంధానం చేసుకోవాలి

పలమనేరు: పలమనేరు ఎస్ఎస్‌డబ్ల్యూవో కార్యాలయ పరిధిలోని ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుతున్న ఎస్సీ విద్యార్థులు తల్లికి వందనం, స్కాలర్‌షిప్పుల కోసం తల్లి బ్యాంకు ఖాతాను విద్యార్థుల బ్యాంకు ఖాతాలోకి ఎన్‌పీసీఐ అనుసంధానం చేసుకోవాలని ఏఎస్‌డబ్ల్యూవో హైమావతి తెలిపారు. విద్యార్థుల తల్లులు సమీపంలోని గ్రామ సచివాలయంలో సిబ్బందిని కలిసి ఎన్‌పీసీఐ అనుసంధానం చేసుకోవచ్చని సూచించారు. ఖాతాలు లేనివారు సమీపంలోని పోస్టాఫీసుల్లో ఖాతాను తెరిచి ఆపై అనుసంధానం చేసుకోవాలని తెలిపారు.

రాజీతోనే కేసుల సత్వర పరిష్కారం





పుంగనూరు లోక్‌అదాలత్‌లో జడ్జి ఆరీఫాషేక్, కుప్పంలో లోక్ అదాలత్ నిర్వహిస్తున్న జడ్జి

పుంగనూరు(చౌడేపల్లె): ఇరువర్గాలు రాజీ పడడం ద్వారా కేసులను సత్వరం పరిష్కరించవచ్చని సీనియర్ సివిల్ జడ్జి ఆరీఫా షేక్ తెలిపారు. జడ్జి శనివారం స్థానిక కోర్టు ఆవరణలో న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఆకుల చెన్నకేశవులుతో కలిసి లోక్ అదాలత్ నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో 69 కేసులను పరిష్కరించి, కక్షిదారులకు రూ.35.65 లక్షల పరిహారాన్ని అందజేశారు. ఇందులో 22 సివిల్, 47 క్రిమినల్ కేసులను పరిష్కరించామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మైత్రి సంబంధాలను కొనసాగించేందుకు లోక్‌అదాలత్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. గ్రామ పెద్దలు, అధికారులు, న్యాయవాదులు తమ పరిధిలోని కేసుల్లోని వాది, ప్రతివాదులను పిలిపించి రాజీ చేసుకునేందుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయవాదులు గల్లా శివశంకర్‌నాయుడు, విజయకుమార్, బాలాజీకుమార్, వెంకటముని యాదవ్, ఆనందకుమార్, వినోద్‌కుమార్, వై.భాస్కర్‌రెడ్డి, ప్రశాంతి, నూరి తదితరులు పాల్గొన్నారు.

కుప్పంలో 67 కేసులు పరిష్కారం

కుప్పం: కుప్పం కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో 67 కేసులు పరిష్కారమైనట్టు అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి రవికుమార్ తెలిపారు. వాటిలో రెండు సివిల్ కేసుల్లో రూ.2 లక్షలు, 27 క్రిమినల్ కేసుల్లో రూ.12,940, 5 బ్యాంకు కేసుల్లో రూ.2.14 లక్షలు, 37 పెట్టీ కేసుల్లో రూ.38,300 పరిహారం ఇప్పించినట్టు తెలిపారు.



పలమనేరు : మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి ఆదినారాయణ

దీర్ఘకాలికంగా పరిష్కారానికి నోచుకోని కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ చంద్రప్ప, కార్యదర్శి ఉదయ్ కుమార్, న్యాయవాదులు, పోలీసులు పాల్గొన్నారు.

పలమనేరులో 203 కేసుల పరిష్కారం

పలమనేరు: పట్టణ సమీపంలోని కోర్టులో శనివారం నిర్వహించిన లోక్‌అదాలత్‌లో 203 కేసులను పరిష్కరించినట్టు సీనియర్ సివిల్ జడ్జి ఆదినారాయణ తెలిపారు. ఇందులో 16 సివిల్, 154 క్రిమినల్, 33 బ్యాంకు కేసులను రాజీ చేసి, రూ.1.13 కోట్లకు పైగా పరిహారం ఇప్పించినట్టు తెలిపారు. జూనియర్ సివిల్ జడ్జి లిఖిత, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎల్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మండల సమావేశం మళ్లీ వాయిదా



ప్రజాప్రతినిధులు లేక ఖాళీగా కుర్చీలు

గంగవరం: మండల సర్వసభ్య సమావేశం శనివారం మళ్లీ వాయిదా పడింది. ప్రజా ప్రతినిధులు హాజరుకాకపోవడంతో కోరం లేక శుక్రవారం సమావేశం వాయిదా పడిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో శనివారం సమావేశం నిర్వహించాలని ఎంపీడీవో సరేష్‌బాబు సర్క్యులర్ జారీ చేశారు. అయినప్పటికీ సభ్యులు రాకపోవడంతో రెండో సారి వాయిదా వేశారు. ఒకే నెలలో ఇలా రెండో సారి సమావేశం వాయిదా పడడం ఇదే మొదటిసారి. దీనికి ఎంపీడీవో సురేష్‌బాబు నిర్లక్ష్యమే కారణమని ప్రజా ప్రతినిధులు ఆరోపిస్తున్నారు. ప్రజాప్రతినిధులకు గౌరవం ఇవ్వకపోవడంతో పాటు గత సమావేశాల్లో సభ్యులు లేవనెత్తిన సమస్యలను ఇప్పటికీ పరిష్కరించలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అలాగే ఎంపీటీసీలకు కేటాయించిన నిధులను పక్కదారి పట్టించడం తదితర కారణాల వల్లే సమావేశానికి సభ్యులు రావడం లేదన్న విమర్శలు వున్నాయి. గతంలో ఎంపీడీవో అవినీతిపై జెడ్పీ సీఈవోకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోకపోవడంపైనా సభ్యులు మండిపడుతున్నారు.

జగనన్న పర్యటనను విజయవంతం చేద్దాం

గంగవరం: మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 9వ తేదీన బంగారుపాళ్యంలో చేపట్టనున్న పర్యటనను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ పిలుపునిచ్చారు. గంగవరంలో శనివారం జరిగిన పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ మామిడికి గిట్టుబాటు ధర అందకపోవడం, రైతులకు అండగా నిలబడాలని జగనన్న సంకల్పించారని తెలిపారు. జగనన్న పర్యటనకు ప్రభుత్వం అనుమతి నిరాకరించడంతో వాహనాల్లోనే నేరుగా వస్తున్నట్టు తెలిపారు. బెంగళూరు నుంచి బయలుదేరి చిత్తూరు హైవే మీదుగా బంగారుపాళ్యం చేరుకుంటారని తెలిపారు. పలమనేరు నియోజకవర్గానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు 9వ తేదీ ఉదయానికే టోల్‌గేట్ వద్దకు చేరుకోవాలని కోరారు. అక్కడి నుంచి ర్యాలీగా బయలుదేరి బంగారుపాళ్యంలో జగనన్నతో కలిసి కార్యక్రమాన్ని విజయవంతం చేస్తామని పిలుపునిచ్చారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలని నిరసన



ట్రాన్స్‌కో ఏఈకి వినతి పత్రమిస్తున్న సీపీఐ నేతలు

పుంగనూరు(చౌడేపల్లె): కూటమి ప్రభుత్వం ఇష్టానుసారంగా విద్యుత్ చార్జీలను పెంచుతోందని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి రామమూర్తి ఆరోపించారు. పెంచిన చార్జీలను తగ్గించాలని, లేనిపక్షంలో ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు. ఆయన శనివారం ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి గోకుల్ సర్కిల్‌లో నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ విద్యుత్ చార్జీలు తగ్గించాలని, స్మార్ట్ మీటర్లను, ట్రూఆఫ్, సర్దుబాటు చార్జీలను ఉపసంహరించుకోవాలన్నారు. ఎన్నికల ముందు కరెంటు చార్జీలు పెంచబోమని, స్మార్ట్ మీటర్లు బిగించమని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలను మోసం చేస్తున్నట్టు వివరించారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే నాలుగు సార్లు విద్యుత్ చార్జీలు పెంచడం దారుణమన్నారు. ఇళ్లలో స్మార్ట్ మీటర్లు బిగించడానికి ప్రభుత్వం సిద్ధమైందని, వెంటనే మానుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాసమూర్తికి వినతిపత్రం అందజేశారు. సీపీఐ సహాయ కార్యదర్శి శ్రీరాములు, కార్మికులు పాల్గొన్నారు.

8న ఉచిత కంటి వైద్య శిబిరం

పుంగనూరు(చౌడేపల్లె): పుంగనూరు పట్టణంలోని బీఎంఎస్ క్లబ్ ఆవరణలో 8న ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ జిల్లా పీఆర్వో డాక్టర్ పి.శివ తెలిపారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ పుంగనూరు, మదనపల్లె లయన్స్‌క్లబ్ సంయుక్తంగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు వైద్యులు రోగులకు పరీక్షలు చేస్తారని వెల్లడించారు. అవసరమైన వారిని ఆపరేషన్లకు ఎంపిక చేస్తారని , కంటి అద్దాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. వైద్యశిబిరానికి వచ్చే వారు ఆరోగ్యశ్రీ కార్డు, ఆధార్ కార్డు, బ్యాంకు పాసుపుస్తకం తీసుకురావాలన్నారు.

వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శుల నియామకం

పలమనేరు: పలమనేరు నియోజకవర్గానికి చెందిన ముగ్గురు నేతలను వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శులుగా నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. గంగవరం మండలానికి చెందిన ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రహ్లాద, పలమనేరు మండలానికి చెందిన ఆర్ చెంగారెడ్డి, పలమనేరు మున్సిపాలిటీకి చెందిన ఎస్డీ మురళీకృష్ణ నియమితులయ్యారు. తమకు రాష్ట్ర పదవులు కేటాయించిన అధినేత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి, రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎన్ వెంకటేగౌడకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు.

చెట్లలోనే మామిడి కాయలు

ఈ ఏడాది ఎన్నడూ లేని విధంగా మామిడి పంటకు గిట్టుబాటు ధర రాలేదు. ఇతర ప్రాంతాలకు ఎగుమతి నిలిచిపోయింది. జిల్లాలో వున్న గుజ్జు పరిశ్రమల వారు కాయలను కొనుగోలు చేయడం లేదు. దీంతో ఏమి చేయాలో తెలియక రైతులు కాయలను చెట్ల లోనే వదిలేశారు. కొందరు కోసిన కాయలను పరిశ్రమల వద్దకు తరలించినా ఖర్చులు కూడా రాకపోవడంతో రోడ్ల పక్కన పడేస్తున్నారు.

- అందని గిట్టుబాటు ధర
- కోత, రవాణా ఖర్చులు కూడా అందని వైనం
- తీవ్రంగా నష్టపోతున్న మామిడి రైతులు





చెట్లలోనే ఉన్న మామిడి కాయలు, రొంపిచెర్ల క్రాస్ రోడ్డు మండీలో వ్యాపారులు కొనుగోలు చేసిన మామిడి కాయలు

పలమనేరు/రొంపిచెర్ల: పలమనేరు, కుప్పం, పుంగనూరు నియోజకవర్గాల్లో 27 వేల ఎకరాల్లో మామిడి ఉండగా ఇందులో 18వేల ఎకరాలు తోతాపురి రకంగా ఉంది. వీటికి ధర ల్లేక రైతులు తోటల్లోనే మామిడిని వదిలేశారు. సీజన్ ఆఖర్లోనైనా ధరలు పలుకుతాయోమోనని చాలామంది రైతులు తోటల్లోనే కాయలను వదిలేశారు. దీంతో మాగిన కాయలు రాలినేలపాలవుతున్నాయి. ఎంత ధర దక్కినా అమ్ముదామునుకుని కాయలు దింపిన రైతులు గుజ్జు ఫ్యాక్టరీల వద్దకెళితే టోకెన్లు దొరకడంలేదు. దీంతో ఫ్యాక్టరీల వద్ద బండ్లు పెట్టుకొని వేచి చూడాల్సిందే. దీంతో కొందరు రైతులు మార్కెట్‌కు తీసుకెళ్ళిన మామిడి కాయలను చేలల్లో పారబోసి వచ్చేస్తున్నారు. మరికొందరు తోటల్లో కాయలు కోయకుండానే వదిలిపెట్టేస్తున్నారు. తోతాపురికి సంబంధించి ఆయా ప్రాంతాల్లోనే ర్యాంపులు పెట్టారు. ఇక్కడి వ్యాపారులు సైతం కిలో రూ.2 కూడా కొనడం లేదు. దీంతో కాయలు కోసి అమ్మినా కూలీలకు, రవాణా చార్జీలకు సైతం డబ్బు రావడం లేదు. రొంపిచెర్ల మండలంలో గానుగచింత, రొంపిచెర్ల, రొంపిచెర్ల క్రాస్ రోడ్డులో మూడు మామిడి కాయల మండీలు వున్నాయి. వ్యాపారులు కాయలను కొనుగోలు చేసి ఇతర ప్రాంతాలకు తరలిస్తూ వుంటారు. ప్రస్తుతం వీరు కూడా ప్రభుత్వం ప్రకటించిన ధర ఇవ్వడం లేదు. కాయలను విక్రయించిన రైతులకు ప్రభుత్వం ఇచ్చే సాయం అందడం లేదు. మామిడి కాయల మండీ దగ్గర అధికారులను ఏర్పాటు చేసి కాయలు విక్రయిస్తున్న రైతులను గుర్తించి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాల్సి ఉంది. ఈ మండీల వద్ద అధికారులు కనిపించడం లేదు.

చెట్ల కిందనే మామిడి పంట

మామిడి పంటకు గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు కాయలను చెట్లలోనే వదిలేశారు. మామిడి కాయలు మాగిపోయి కింద రాలుతున్నాయి. గత ఏడాది కూడా గిట్టుబాటు ధర అందలేదని, ఈ ఏడాదైన ధర ఉంటుందని రైతులు ఆశించారు. ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించకపోవడంతో అప్పులపాలవుతున్నట్టు రైతులు వాపోతున్నారు. కళ్ల ముందే చెట్ల నుంచి కాయలు రాలుతుంటే కన్నీరు వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పలమనేరు మండలంలో తోటల్లోనే వదిలేసిన మామిడి కాయలు



రొంపిచెర్ల మండలంలో మామిడి చెట్ల కిందనే మాగీ రాలిన మామిడి కాయలు

5,453 టన్నుల కొనుగోలు



సదుంలోని పీఎల్ఆర్ జ్యూస్ ఫ్యాక్టరీ వారు ఇప్పటి వరకు 5,453 టన్నుల మామిడి కాయలను కొనుగోలు చేశారు. సదుం చుట్టు పక్కల 1,088 మంది రైతులు మామిడి కాయలను విక్రయించారు. వీరందరికీ ప్రభుత్వం ప్రకటించిన రాయితీని బ్యాంకు ఖాతాలో జమ చేస్తాం. రొంపిచెర్ల మండలంలో మూడు మండీల్లో ప్రభుత్వం ప్రకటించిన రాయితీ సొమ్ము రాదు. పల్స్ ఫ్యాక్టరీల్లో విక్రయించిన రైతులకు మాత్రమే రాయితీ వస్తుంది. –సంతోషికుమారి, ఉద్యాన శాఖ అధికారిణి

నేడు సదుంలో ఎమ్మెల్యే పర్యటన

సదుం: వైఎస్సార్ సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదివారం సదుం మండలంలో పర్యటించనున్నట్టు ఆ పార్టీ నాయకులు తెలిపారు. ఎర్రాతివారిపల్లెలో జరగనున్న ఆయన తండ్రి పెద్దిరెడ్డి లక్ష్మరెడ్డి వర్ధంతి కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

నేడు పెన్షనర్ల సమావేశం

పలమనేరు: పట్టణంలోని బాలికోన్నత పాఠశాలలో ఆదివారం ఉదయం పది గంటలకు పెన్షనర్ల సమావేశం నిర్వహించనున్నట్టు ఆ సంఘం అధ్యక్షుడు సోమచంద్రారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఖజానా కార్యాలయంలో పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించనున్నట్టు తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం సలహాలు, సూచనలు తెలుసుకోవాలని సూచించారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

చిత్తూరు రూరల్(కాణిపాకం): ఆర్టీసీ ఉద్యోగులు, డిపో సమస్యలను పరిష్కరించాలని ఎంప్లాయిస్ యూనియన్ (ఈయూ) నాయకులు డిమాండ్ చేశారు. వారు శనివారం చిత్తూరు నగరంలోని ఆర్టీసీ వన్‌డిపో గేటు ఎదట ధర్నా చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు చేపట్టిన ఈ ధర్నాను రెండు రోజుల పాటు కొనసాగించారు. వారు మాట్లాడుతూ ఉద్యోగుల బకాయిలను చెల్లించాలన్నారు. ఆరోగ్య భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.